ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.8 | కనిష్ఠం 21.4



కామారెడ్డి జిల్లా వార్తలు

5

శుక్రవారం 26 జూలై 2024

3వ తేదీన బాన్సువాడలో జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, జూలై 25: ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీలో డీపీవో రోల్ కోసం ఆగస్టు 3న బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో 2023, 2024 సంవత్సరంలో చదివిన బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్‌లో అర్హులైన అభ్యర్థులు జాబ్ మేళాలలో పాల్గొనాలని తెలిపారు. మేళాకు హాజరయ్యే సమయంలో పది, ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో డ్రైవ్ స్థలానికి తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

సంక్షేమం, వ్యవసాయానికి..

పెద్దపీట!









- అభివృద్ధి, వ్యవసాయానికి అధిక మొత్తంలో నిధులు
- రైతు బడ్జెట్ అంటున్న అధికార పార్టీ
- వ్యవసాయానికి రూ.72వేల కోట్లు
- గృహజ్యోతికి రూ.2418 కోట్లు
- ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
- అంకెల బడ్జెట్‌గా పేర్కొంటున్న ప్రతిపక్షాలు

కామారెడ్డి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.90లక్షల కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ ప్రధానంగా వ్యవసాయం, రైతు సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించారు. రైతు బడ్జెట్‌గా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో వేల కోట్ల నిధులను కేటాయించారని అధికార పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. అదే విధంగా నీటి పారుదల, విద్య వైద్యానికి పెద్దపీట వేస్తూ అధిక మొత్తంలోనే నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందని అధికార పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ బడ్జెట్ అంకెల బడ్జెట్ తప్ప ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయదని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలకు నిధులు కేటాయించలేదని ప్రతిపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్ష, అధికార పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిధులు జిల్లాలోని అభివృద్ధికి, ప్రాజెక్టుల పనులకు సంక్షేమానికి ఎంత మేరకు వస్తాయో వేచి చూడాలి.

వ్యవసాయం, అభివృద్ధికి నిధుల కేటాయింపు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.72,659 కోట్లు కేటాయించారు. రైతు రుణమాఫీ మొదటి విడత ప్రక్రియ కొనసాగుతుందని ఈ నెలలోపు రెండో విడత ఆగస్టు 15కల్లా పూర్తిగా రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. రైతు భరోసా కింద వరికి రూ.500 బోనస్ ఇస్తామని మంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. అదేవిధంగా రైతుభరోసా కింద అర్హులైన రైతులకు ఎకరాన రూ.15వేలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కౌలు రైతులకు కూడా సహాయం అందించడానికి మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ఏడాది ప్రతీ నియోజకవర్గానికి 3500ల ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. విద్యా రంగానికి రూ.21,292 కోట్లు, వైద్య రంగానికి రూ.11,468 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.22,301 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.29,816 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.19,080 కోట్లు, హోం శాఖకు రూ.9,564 కోట్లు, ఆర్ అండ్ బీకి రూ.5,790 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.16,410 కోట్లు ఇలా పలు రంగాలకు పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించారు.

సంక్షేమానికి ప్రాధాన్యత

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా ప్రజలకు పలు హామీల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ఎన్నికల కదన రంగంలోకి దూకింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాస్, చేయూత, మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్ లాంటి పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇందులో ఇప్పటికే రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ అమలు చేస్తోంది. మరో రెండు పథకాలైన గృహజ్యోతి సబ్సిడీ సిలిండర్‌ను అమలులోకి తీసుకువచ్చింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత ఇచ్చింది. గృహజ్యోతికి రూ.2418 కోట్లు, మహాలక్ష్మి ఉచిత రవాణాకు రూ.723 కోట్లు, ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ.3,836 కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సంక్షేమాలకు సైతం వేల కోట్లలోనే నిధులు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ.17వేల కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3వేల కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.9 వేల 200 కోట్లు, స్త్రీ శిశు సంక్షేమానికి రూ.2736 కోట్లు కేటాయించారు.

బడ్జెట్‌పై ప్రతిపక్షాల పెదవి విరుపు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై జిల్లాలోని ప్రతిపక్ష పార్టీల నేతలు పెదవి విరుస్తున్నారు. మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన రూ.2.91లక్షల బడ్జెట్‌ను, అంకెలకే పరిమితం కానుందని రాష్ట్ర అభివృద్ధికి గాని, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడదని ప్రతిపక్షాల పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకొస్తున్నప్పటికీ ఆశించిన మేర నిధులు కేటాయించలేదని దీంతో పాటు వ్యవసాయరంగానికి, రైతుల రుణమాఫీకి పెద్ద మొత్తంలో నిధులను ఈ బడ్జెట్‌లో పెట్టలేకపోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి నీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతలు, పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి కూడా పూర్తి స్థాయిలో నిధులను కేటాయించలేకపోయిందని మండి పడుతున్నారు.

అందరికి ఆమోదయోగ్యమైన బడ్జెట్

• షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారుడు, కామారెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నా ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ పథకాలకు, వ్యవసాయ రంగానికి, అభివృద్ధికి అధిక నిధులు కేటాయించింది. ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంది.

రైతు బడ్జెట్

• మదన్‌మోహన్‌రావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



అసెంబ్లీలో మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతు సంక్షేమానికి ఎంతో ఉపయోగపడనుంది. రైతు బడ్జెట్‌గా రూపొందించారు. వ్యవసాయరంగానికి 72 వేల కోట్లు కేటాయించారు. వ్యవసాయానికే కాకుండా వైద్య, విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అభివృద్ధికి సైతం భారీగా నిధులు కేటాయించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.246కోట్లు అభివృద్ధి పనుల కోసం వచ్చే అవకాశం ఉంది.

ఏడాదిలో లెండి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

• తోట లక్ష్మీకాంతారావు, జుక్కల్ ఎమ్మెల్యే



రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2.91లక్షల బడ్జెట్‌ను ప్రకటించింది. వ్యవసాయరంగంతో పాటు అనుబంధ రంగాలైన నీటి పారుదలకు అధిక మొత్తంలోనే నిధులు కేటాయించారు. జుక్కల్ రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న లెండి ప్రాజెక్టు పనులు ఈ బడ్జెట్‌తో సంవత్సరంలోగా పూర్తి చేస్తాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి, యూనివర్సిటీలకు వందల కోట్లలో నిధులను బడ్జెట్‌లో పొందుపరిచింది.

ఏ ఒక్క వర్గానికి ఉపయోగపడని బడ్జెట్

• ముజిబొద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాంగ్రెస్ తన ప్రచారం కోసం నిధులు ఎక్కువగా కేటాయించుకున్నట్లు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయదు. సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి చెప్పుకోదగ్గ నిధులను కేటాయించలేదు. వ్యవసాయాన్ని, యువతకు ప్రాధాన్యత ఇవ్వలేదు.



పీహెచ్‌సీలో వివరాలను తెలుసుకుంటున్న బృందం సభ్యులు

భిక్కనూరు పీహెచ్‌సీని పరిశీలించిన ఎన్‌పీఎన్‌సీడీ బృందం

భిక్కనూరు, జూలై 25: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండలంలోని రామేశ్వర్‌పల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం ఎన్‌పీఎన్‌సీడీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వనీ, శిరీష ఆయా ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలను, నాణ్యత ప్రమాణాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్‌సీడీ పోర్టల్‌లో మండలంలోని రోగుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రతీ ఒక్కరికి అబా కార్డును ఏర్పాటు చేసి అబాకార్డును ఆధార్‌తో లింక్ చేయాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హేమిమా, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఉషశ్రీ, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సిద్ధరామేశ్వర్‌రావు, సూపర్ వైజర్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలతో కొచ్చెరి మైసమ్మ

ఆలయానికి బయలుదేరిన మహిళలు

నసురుల్లాబాద్, జూలై 25: ఆషాఢ మాసంలో బోనాల పండగ సందర్భంగా నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ దేవాలయానికి మైలారం గ్రామస్థులు, అమ్మవారికి ప్రతీ ఇంటి నుంచి గురువారం మైసమ్మకు మొదటి రోజు ఘనంగా మహిళలు గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయానికి బోనాలతో బయలు దేరి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం భారీ మొత్తంలో ప్రతీ ఇంటి నుంచి కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు, ఏర్పాటు చేసుకుని బంధు మిత్రులతో ఘనంగా అమ్మవారికి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించి ప్రత్యేక అర్చన, అమ్మవారికి దీవెనలు తీసుకుంటారు. మైలారం గ్రామం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ఇతర జిల్లా నుంచి మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆలయ సమీపంలో మహా జాతర అనంతరం గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చిన భక్తులకు, ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యుల, గ్రామ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కొచ్చెరి మైసమ్మ ఆలయానికి వెళుతున్న మహిళలు

జలాశయాల్లో పెరుగుతున్న నీటి నిల్వలు

- చిగురిస్తున్న రైతుల ఆశలు
- పొంగి పొర్లుతున్న నల్లవాగు మత్తడి
- కళ్యాణి ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత
- మంజీరా నదిలోకి నీరు
- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి అతి స్వల్పంగా ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, జూలై 25: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షానికి జలాశయాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలోని నల్లవాగు మత్తడి పొంగి పొర్లుతోంది. మంజీరా నదిపై నిర్మించిన కళ్యాణి ప్రాజెక్టు నిండగా, నీటి పారుదల శాఖాధికారులు గేట్లను ఎత్తివేశారు. ఉభయ జిల్లాల్లోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 830 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నిజాంసాగర్‌లో క్రమేపీ నీటి నిల్వలు పెరుగుతున్నాయి. 1405 అడుగులకు గాను 1388.12 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. 3.737 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నల్లవాగు మత్తడి పొంగి పొర్లడంతో నాన్ కమాండ్ ఏరియాలోని 400 ఎకరాల భూమికి వర్షాకాలంలో ఢోకా లేదు. వర్షాకాలం ప్రారంభమై నెల పక్షం రోజులు గడుస్తున్నా భారీ వర్షాలు లేకపోవడంతో నిజాంసాగర్‌లోనికి అడుగంటిన స్థాయిలో నీరు ఉండటం గమనార్హం. సింగీతం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో సింగీతం ఆయకట్టు కింద ఉన్న 600 ఎకరాలకు సాగునీరు అందనుంది. కౌలాస్, నిజాంసాగర్, కళ్యాణి, సింగీతంలలో నీటి నిల్వలు పెరుగుతుండటంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పటికీ భారీ వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద లక్షా 15వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందుగానే వరినాట్లు పూర్తి చేసుకున్న రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయిలో నీరు చేరితే ఆయకట్టు కింద పంటలు గట్టెక్కనున్నాయి.



పోచారం ప్రాజెక్టులోకి చేరిన నీటి మట్టం



కళ్యాణి ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసిన దృశ్యం

రాకుంట చెరువుకు బుంగ

బీర్కూర్ : బీర్కూర్ పరిధిలోని రాకుంట చెరువుకు బుంగ పడింది. చెరువులో నీరు వృథాగా పోతుండటంతో ఆయకట్టు రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. గురువారం ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్, డీఈ జగదీష్, ఏఈ గజేందర్‌లు చెరువు వద్దకు చేరుకున్నారు. తూం పక్కన బుంగ ఏర్పడినట్లు గుర్తించారు. వెంటనే ఇసుక బస్తాలను తెప్పించి గజ ఈతగాళ్ల సహాయంతో బుంగ ఏర్పడిన చోట బస్తాలను వేయించి బుంగను పూడ్చేశారు. గత నాలుగైదు రోజులుగా వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా చెరువులోకి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది. దీంతో చెరువు తూం పక్కన బుంగ ఏర్పడినట్లు ఆయకట్టు రైతులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టడంతో కట్టకు ఎలాంటి ముప్పు వాటిళ్లలేదని రైతులు తెలిపారు.

ఎనిమిది అడుగులకు చేరిన పోచారం నీటి మట్టం


నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నీటి మట్టం ఎనిమిది అడుగులకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు స్వల్పంగా వచ్చి చేరగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయింది. గత ఆదివారం వరకు ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్‌లో ఉండగా, పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరింది. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 8 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.349 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రానికి ఇన్ ఫ్లో 181 క్యూసెక్కులకు తగ్గిపోయింది.

కౌలాస్ నాలా ప్రాజెక్టుకు స్వల్పంగా వరద నీరు

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్ట్‌కు స్వల్పంగా వరదనీరు వచ్చి చేరినట్లు ఏఈఈ రవిశంకర్ తెలిపారు. కౌలాస్ నాలా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు 521 క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని తెలిపారు. వానా కాలం ప్రారంభం అయి సుమారు రెండు నెలలు కావస్తున్నా ప్రాజెక్ట్‌లోకి వరదనీరు రావడం ఇదే తొలిసారని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం కెపాసిటీ 1.237 టీఎంసీల నీటి మట్టం కాగా, ప్రస్తుతం 0.580 నీటి మట్టం ఉన్నట్లు ఏఈఈ తెలిపారు. అంతేగాక 458 మీటర్ల నీటి మట్టానికి గాను 454.70 మీటర్ల నీటిమట్టం ఉన్నట్లు ఏఈఈ తెలిపారు. ఉదయం ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా చేరిన వరదనీరు సాయంత్రానికి తగ్గిపోయిందన్నారు.



రాకుంట చెరువుకు బుంగ పడిన దృశ్యం



దోస్త్ స్పెషల్ ఫేస్ ద్వారా ఖాళీల భర్తీ

ధర్పల్లి, జూలై 25: ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు దోస్త్ స్పెషల్ ఫేస్ షెడ్యూల్ తేదీ ఈనెల 25 నుంచి ఆగస్టు 2 వరకు ఉందని ప్రిన్సిపాల్ పి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఇంగ్లీష్ మీడియాం 51, తెలుగు మీడియం 58,బీకాం సీఏ 105, బీఎస్సీ లైఫ్‌సైన్స్ 44, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ 43 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు, ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వారు కూడా ఈ స్పెషల్ ఫేస్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.







ఆలూర్‌లో స్పెషల్‌డ్రైవ్

ఆర్మూర్‌రూరల్, జూలై 25: మండల కేంద్రంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులచే మురికికాల్వలు శుభ్రం చేయించారు. పెద్ద డ్రైనేజీల్లో పెరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో తీసి మురికినీరు వెళ్లేలా చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజలింగం, డాక్టర్ గణేష్, లైన్‌మెన్ శివ, కారోబార్ సంతోష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

పెద్దబజార్, జూలై 25: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీ సతీమణి ప్రియాంక ధర్మపురి అన్నారు. గురువారం సీఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో 25వ కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా జమ్మూకశ్మీర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అమరవీరుల స్మృతిలో మొక్కలు నాటారు. అ నంతరం కార్గిల్ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నమలై కుప్పుస్వామి, ప్రముఖ సినిమా ఫొటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







కత్తులతో బెదిరించి చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేష్, ఎస్సై తిరుపతి

జక్రాన్‌పల్లి, జూలై 25: కత్తులతో మహిళను బెదిరించి అరిస్తే చంపివేస్తామని ఇంట్లోకి చొరబడి బీరువలో ఉన్న బంగారు పుస్తెలతాడు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి మండలంలోని నారాయణపేట్ గ్రామంలో జరిగింది. గురువారం ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి నారాయణపేట్ గ్రామంలో జాన్కంపేట లక్ష్మీ ఇంట్లో ఒంట గిరిగా ఉందని గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చారని తెలిపారు. ఆమె ఇంటికి తలుపులు కొట్టి మీ మరిది చనిపోయాడని, మహిళకు చెప్పడంతో సదరు ఆమె తలుపులు తీసిందన్నారు. దీంతో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు లక్ష్మీకి కత్తిచూపించి చంపివేస్తానని బెదిరించి ఇంట్లోని బీరువ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రూ.10వేల నగదు దోచుకెళ్లారన్నారు. లక్ష్మీ కుమారుడు మహేష్ ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై తిరుపతి పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వేలి ముద్రలను సేకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 100లేదా 8712659853 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మంజీరా నదిన ఒడ్డున పశువుల కాపర్లు

● గజ ఈతగాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చిన పోలీసులు



గజ ఈతగాళ్ల సహాయంతో నది దాటుతున్న పశువుల కాపర్లు

బోధన్‌రూరల్, జూలై 25: సాలూర మండలంలోని మందర్నా గ్రామ శివారులో గల మంజీరా ఒడ్డున ఉన్న ముగ్గురు పశువుల కాపర్లను సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వివరాలు.. రోజు మాదిరిగా గురువారం ఉదయం పశువులను తీసుకొని శివరాజ్, చందు, ప్రకాష్ మహరాజ్‌లు పశులను మేపడానికి నది దాటి మహారాష్ట్రలోని ఎస్గి అటవీ ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం పశువులను తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు లెండీ ప్రాజెక్టు నీళ్ల వదలడంతో మంజీరా నదికి ప్రవాహం పెరిగింది. దీంతో పశువులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాయి. కాగా, ముగ్గురు పశువుల కాపరులలో ప్రకాష్ మహరాజ్ వృద్ధుడు కావడంతో నది దాటేందుకు జంకడంతో మిగతా కాపర్లు గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ రూరల్ సీఐ కోలా నరేష్ పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగళ్లను రప్పించి నది ఒడ్డున ఉన్న కాపరులను సురక్షితంగా తీసుకువచ్చారు.

మహిళపై హత్యాయత్నం కేసు నమోదు

నవీపేట, జూలై 25: నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన సావిత్రి అనే మహిళపై గురువారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జలాల్‌పూర్‌కు చెందిన గైనిశెట్టి గంగవ్వ నెల రోజుల క్రితం తన వద్ద ఉన్న కుక్కర్‌ను అదే గ్రామానికి చెందిన సావిత్రికి 2వేల రూపాయలకు విక్రయించింది. కుక్కర్ కొద్ది రోజులు బాగానే పని చేసిన తర్వాత అది పని చేయడం లేదు. దీంతో 5రోజుల క్రితం గంగవ్వ, సావిత్రిలు కలిసి నిజామాబాద్ వెళ్లి కుక్కర్‌కు రిపేర్ చేయించారు. అయినప్పటికీ కుక్కర్ సరిగా పని చేయడం లేదు. విసుగు చెందిన సావిత్రి గురువారం ఉదయం కుక్కర్‌తో పాటు కత్తిని వెంట తీసుకుని గంగవ్వ ఇంటికి వెళ్లింది. కుక్కర్ వాపసు తీసుకుని తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని గొడవకు దిగింది. ఈ సమయంలో సావిత్రి తన వద్ద ఉన్న కత్తితో గంగవ్వ తలపై దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది.వెంటనే సావిత్రి దాడి చేసి పారిపోవడానికి యత్నించింది. స్థానికులు సావిత్రినివెంబడించగా అదుపుతప్పికింద పడడంతో ఆమె కాళ్లు, పొట్టభాగంలో గాయాలయ్యాయి.వెంటనే 108లో బాధితురాలు గంగవ్వతో పాటు సావిత్రిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితురాలు గంగవ్వకు వరుసకు సోదరుడుఅయ్యేరాజు ఫిర్యాదు మేరకు సావిత్రిపైహత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీయూలో న్యాయ కళాశాలలో పరీక్షలు

డిచ్‌పల్లి, జూలై 25: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు గురువారం నిర్వహించినట్లు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ జట్లింగ్ ఎల్లోసా తెలిపారు. ఈ పరీక్షలకు ఎక్సాటర్నల్ ఎక్సామినార్ నిజామాబాద్ సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో భాగంగా విద్యార్థులకు మన రాష్ట్రంలో పార్టీల మార్పిడి వ్యవహారాలపై కేసులు రూపొందించి సుప్రీం కోర్టు ముందు వాజ్యం దాఖలు అయిన సందర్భంగా స్పీకర్‌కు గల విచక్షణ అధికారలపై న్యాయ విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, డా.స్రవంతి, డా.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఏర్గట్ల, జూలై 25: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర శిక్షణలో భాగంగా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ, ఉపాధ్యాయులు గంగాధర్, మునీరోద్దీన్ పాల్గొన్నారు.



'కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి'

గాంధారి, జూలై 25 : మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మండల స్థాయి అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో, ఎంపీడీవో రాజేశ్వర్ మాట్లాడుతూ రాబోయే రెండు, మూడురోజులలో భారీవర్షాలు ఉన్నందున కార్యదర్శులందరూ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. కూలిపోయే ఇండ్లు ఉంటే ఆ కుటుంబాలను ఇతర స్థలాలకు వసతి కల్పించాలని సూచించారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయించాలని, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్‌బాల్స్ వేయాలని, రెండు, మూడురోజులకు ఒకసారి ఫాగింగ్ చేయాలని తెలిపారు. ఒకవేళ వ్యాధులు ఏమైనా వస్తే సంబంధిత ఏఎన్ఎం, ఆశవర్కర్ సంబంధిత హెల్త్ డిపార్ట్‌మెంట్ వారి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, వైద్యులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని భిక్కనూరు ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి సూచించారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం భిక్కనూరు డంపింగ్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో మహేష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధారి పాఠశాలలో నృత్యనాటక ప్రదర్శనలు

గాంధారి, జూలై 25 : గాంధారి ఉన్నత పాఠశాలలో శిక్షసప్తహ కార్యక్రమంలో భాగంగా భిన్నత్వంలో ఏకత్వం అనే అంశంలో విద్యార్థులతో నృత, నాటక ప్రదర్శనలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. భారతదేశంలోని విభిన్న మతాలకు సంబంధించిన వేషధారణలతో దేశంలోని సంస్కృతి ప్రతిబింబించేలా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గైడ్‌టీచర్ మన్సూర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రామారెడ్డి, జూలై 25 : 2024-25 విద్యాసంవత్సరంనకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఒకేషనల్ గ్రూపులలో మిగిలిన ఖాళీల కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉప్పల్‌వాయి ప్రిన్స్‌పాల్ శివ రాం తెలిపారు. ఈ స్పాట్ కౌన్సెలింగ్ బాలికలకు శుక్రవారం, ధర్మా రంలో బాలురకు శనివారం భిక్కనూర్‌లో నిర్వహిస్తారని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ సెక్రెటరీగా హీరాలాల్

కామారెడ్డిటౌన్, జూలై 25 : కామారెడ్డి జిల్లా నూతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రెటరీగా హీరాలాల్ నియామకమయ్యాడు. గురువారం డీఈవో రాజు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు సంవత్సరాలు అందరి సహకారంతో క్రీడల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని వివరించారు. కార్య క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాయిమౌర్య, నయబ్‌రసూల్, సురేష్, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు అన్యాయం

పెద్ద కొడప్‌గల్, జూలై 25 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు తగ్గించి అంగన్‌వాడీలకు అన్యాయం చేశారని విమర్శించారు. గత 23-24 బడ్జెట్‌లో అంగన్‌వాడీల కోసం 21 వేల 523 కోట్లు కేటాయించగా, ఈ సారి బడ్జెట్‌లో 21 వేల 200 కోట్లు కేటాయించారని, దీంతో గతం కంటే తక్కువగా 323 కోట్లు కేటాయించారని తెలిపారు.

పెద్దకొడప్‌గల్ ఎంపీవోగా లక్ష్మీకాంత్ రెడ్డి

పెద్ద కొడప్‌గల్, జూలై 25 : పెద్దకొడప్‌గల్ మండల ఎంపీవోగా గురు వారం లక్ష్మీకాంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా మెదక్ జిల్లా పాపన్నపేట్ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీవో లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని తెలిపారు. దీంతో పాటుగానే మండలంలోని ఆయా గ్రామాల్లో పాలన సజావుగా సాగేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు

మద్నూర్, జూలై 25 : మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రం కాగా పలువురికి గాయపరుస్తుండటంతో గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ కుక్కలను పట్టుకునే బృందానికి పిలిపించారు. గురువారం మండల కేంద్రంలో సుమారు వంద కుక్కల వరకు బృందం సభ్యులు తీసుకెళ్ళినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ తెలిపారు. మరో రెండు రోజులుగా కుక్కలను పట్టు కెళ్తారని గ్రామంలో ఎవరైనా తమ ఇంటి వద్ద పెంచుకున్న కుక్కలు ఉన్నట్లయితే వాటిని ఇంటి లోపల ఉంచుకోవాలని సూచించారు.

టేక్రియాల్ చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, జూలై 25 : కామారెడ్డి మండల శివారులోని టేక్రియాల్ చెరువును గురువారం కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ ప్రజలు తాగునీటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని టేక్రియాల్ సమీపంలో గల పెద్దచెరువును నీటిలభ్యత గురించి పరిశీలించినట్లు తెలిపారు. కామారెడ్డి పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండగా తాగునీటి ఎద్దడి ఏర్పడ కుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. పట్టణానికి తాగునీటి అవసరం కోసం 30 శాతం మంచినీటి సప్లయ్ కోసం ప్రతి పాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, డీఈ సంతోష్, టీపీవో గిరిధర్, కౌన్సిలర్‌లు పాతశివకృష్ణమూర్తి, లడ్డు మొయినోద్దిన్, అంజద్, సలీం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్‌చైర్‌పర్సన్

మోటాట్‌పల్లిలో కూలిన ఇళ్లు

- కూలుతున్న పెంకుటిళ్లు
- పరిశీలించిన అధికారులు



కామారెడ్డిలో కూలిన ఇళ్లు

భిక్కనూరు, జూలై 25 : మండలంలోని అన్ని గ్రామాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి మండలంలోని మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షానికి గురువారం ఉదయం మండలంలోని మోటాట్‌పల్లి గ్రామంలో బోయిని స్వామి, బుర్ర మంజుల, బోయిని బాస్కర్‌కు చెందిన నివాసపు ఇళ్లు, గోడలు కూలాయి. సమాచారం అందుకున్న ఎంపీవో రాజ్ కిరణ్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ మేరకు ఎంపీవో మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండటంతో మండలంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరు ఉండకూడదని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమ సిబ్బంది సమాచారం అందించాలని కోరారు. చెరువులు, వాగులు, కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు.

కామారెడ్డిలోనూ ఇబ్బందులు..

కామారెడ్డిటౌన్ : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో ప్రజలకు ముప్పు ఏర్పడుతుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో ఏళ్ల నాటి పెం కింటిళ్లు ఉండడంతో ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా ఇంటి పైకప్పు నుంచి నీరు కారుతుండడంతో ప్రజలు భిక్కుభిక్కు మంటూ నివసించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల మున్సిపల్ అధికారులు ఆయా వార్డుల లో పాత ఇండ్లకు నోటీసులు అందించి వాటిని ఖాళీచేయాలని సూచించారు. కాని వారు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. శుక్రవారం 47వ వార్డులోని పలు ఇండ్లు కూలడంతో బాధితులు అప్పటికప్పుడు ముసురు వర్షంలోనే ఇంటి సామాన్లు తాత్కలికంగా మరోఇంట్లోకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలిన ఇండ్లకు సైతం అధికారులు వచ్చి నష్టానికి సంబంధించి అంచనా వేయడంలో అల సత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తమ గోడును పట్టించుకొని, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందనే ప్రజలు కోరుతున్నారు.



మోటాట్‌పల్లిలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

రౌడీ షీటర్ షాహిద్ పాషా అరెస్టు

నాగిరెడ్డిపేట, జూలై 25 : మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ షాహెద్ పాషాను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. షాహిద్ పాషా ఇతరుల భూములను కబ్జా చేసుకుంటూ వాళ్ళను భయ భ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో షాహెద్‌పా షాపైన పలు కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. దీంతో షాహెద్ పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై రాజు ఉన్నారు.



నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో షాహిద్‌పాషాతో డీఎస్పీ, పోలీసులు

హత్య కేసులో నిందితుల అరెస్టు

సదాశివనగర్, జూలై 25 : సదాశివ నగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జీర్లచిన్నమల్ల య్యను హత్యచేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో ఈనెల 20న జీర్లమల్లయ్య కనిపిం చడం లేదని అతని కుమారుడు ప్రదీ ప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేశారు. జీర్ల చిన్న మల్లయ్య అదే గ్రామానికి చెందిన కందూరి పెద్దసాయిలుతో వెళ్లినట్లుగా సీసీ కెమెరాలో గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయంపై లోతుగా దర్యాప్తు జరపగా అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన గుందాదిసుమన్, జోగు బీరయ్య, కందురి పెద్దసాయిలు కలిసి గతం లో వారి మధ్య గొడవలున్నాయి. సుమన్, బీరయ్యలు కొబ్బరి బొండాలు దొంగతనం చేసిన కేసులో మల్లయ్య కొడుకు ప్రవీణ్ ప్రత్యేక్ష సాక్షిగా ఉన్నాడు. దీంతో పలుమార్లు మల్లయ్య సుమన్, బీరయ్యలను కించపరి చినట్లుగా మాట్లాడడం తదితర విషయాల్లో ఘర్షణ జరిగింది. మూడునెలల క్రితం జీర్ల చిన్నమల్లయ్య కొడుకు ఉరివేసుకుని చనిపోయిన విషంలో కూడా మృతుడు వారిని నా కొడుకు పట్టిన గతే మీకు పడుతుందని అనడంతో ఎలాగైన మల్లయ్యను చంపాలని పథకం పన్నారు. ఈనెల 19న పథకం ప్రకారం మిషన్‌భగీరథ వెనుక భాగంలో ముగ్గురు జీర్లచిన్నమల్లయ్యను హత్యచేసి ఎవరికి అనుమానం రాకుండా ఇంకుడు గుంతలో పూడ్చి పెట్టారని తెలిపారు. ఈనెల 24న ముగ్గురు వ్యక్తులు కలిపి బీరయ్య బైక్‌పైన కామారెడ్డి వైపు వెళ్తుండగా సదాశివనగర్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో వారిని పట్టుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారని ఆయన తెలిపారు. నింది తులను కోర్టులో గురువారం హాజరు పర్చగా న్యాయాధికారి జ్యూడిషియల్ రిమాం డ్‌కు పంపారని తెలిపారు. కార్య క్రమంలో సీఐ సంతోష్, ఎస్ఐ రాజు పాల్గొ న్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

విద్యుత్‌షాక్‌తో మహిళా కౌలు రైతు మృతి

మాచారెడ్డి, జూలై 25 : ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఓ మహిళా కౌలు రైతుమృతిచెందిన సంఘటన మాచారెడ్డి మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మఠం రాళ్ల తండాలో చోటుచేసుకుంది. మఠంరాళ్ల తండాకు చెందిన రమావత్ ప్రమీల(33) భర్తతో విడాకులు తీసుకుంది. కొడుకు అరవిం ద్‌ను చూసుకుంటూ జీవనం సాగిస్తోంది. బలరాంనకు చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంది. కౌలుకు తీసుకున్న భూమిలో వరినాటు వేయడానికి ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ భూమి వద్దకు బయలు దేరింది. వరినాటు వేయడానికి పక్కనే ఉన్న మరో రైతు వ్యవసాయ భూమి నుంచి వెళు తుండగా విద్యుత్‌వైర్లు కిందకు వాలడంతో ఈ వైర్ల కింద నుంచి గొడుగు పట్టుకుని దాటుతుండగా గొడుగు వైర్లకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై ప్రమీల అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ అనిల్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన రమావత్ ప్రమీల

ప్రిన్సిపాల్‌కు సన్మానం

పెద్దకొడప్‌గల్, జూలై 25 : పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన నళిని ఇటీవలే నిజామాబాద్ జిల్లా సుద్దపల్లి గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది బదిలీపై వెళ్లిన నళినిని సన్మానించారు. అనంతరం నళిని మాట్లాడుతు పాఠశాల నిర్వహణలో గత కొద్ది సంవత్సరాలుగా తనకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో పదవీ విరమణ చేసిన పెద్ద కొడప్‌గల్ పాఠశాల గుర్తుండిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ విజయ లక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ లలిత, సిబ్బంది రాములు, చైతన్య, జయశ్రీ, వాసవి, నవనీత పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

కామారెడ్డిటౌన్, జూలై 25 : మండల పరిధిలోని దుర్గం గ్రామపరిధిలోని మొక్కజొన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి నరేష్ పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నీరునిల్వ ఉంటే పంటలు ఎరువు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మొక్కజొన్నలో బ్యాక్టీరియల్ స్టాక్‌రాట్ రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అక్కడక్కడ గుర్తించారు. ఈ స్టాక్‌రాట్ వచ్చినప్పుడు మొక్క కణుపు వద్ద మెత్తగా నీటిలో నానినట్లు కనిపించి కుళ్లిన కోడి గుడ్డు వాసన వస్తుందని తెలిపారు.

'విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన అవసరం'

డోమకొండ, జూలై 25 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్‌నేరాలపై ఇన్‌చార్జ్ ఎస్సై సుబ్రహ్మణ్యచారి అవగాహన కల్పించారు. కళాశాలలో కళాబృందం షీటీంపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలనపై తెలిపారు. సైబర్‌నేరాల పట్ల టోల్‌ఫ్రీ నంబర్ 1930, అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 100, 108, 1930, 181ల విలువలను తెలియ జేశారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రభాకర్, శేషారావు, సాయిలు, పీసీలు చంద్రకాంత్, స్వామి, ఎల్లయ్య, లెక్చరర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై

'బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి'

కామారెడ్డిటౌన్, జూలై 25 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కామారెడ్డి జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించలేదని బీజేపీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రబడ్జెట్‌లో కామారెడ్డి పేరు ప్రస్తావించకపోవడం విడ్డూరమని వాపోయారు. జిలా నుంచి గెలిచిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కామారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత లేదని అన్నారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్‌జైన్ మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్నివర్గాలకు సమన్యాయం చేయలేదన్నారు. పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు'

డోమకొండ, జూలై 25 : మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంపై ఎంపీడీవో రమేష్ ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తమ తమ విధులు బాధ్యతగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచిసేవలు అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్‌కుమార్, ఏపీఎం రాజు, సీసీలు రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోటల్స్, సూపర్‌మార్కెట్‌ల తనిఖీలు



నిల్వ ఉన్న ఆహారాన్ని కవర్లలో వేయిస్తున్న అధికారులు

కామారెడ్డిటౌన్, జూలై 25 : పట్టణంలోని పలు హోటల్స్, సూపర్ మార్కెట్‌లను ఫుడ్‌సెఫ్టీ అధికారి సునీత, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.ఎ ఖలీల్‌లు గురువారం తనిఖీ చేపట్టారు. పరిశుభ్రతను పాటించని పలువురికి నోటీసులు జారీచేశారు. ఆహార పదార్థాల తయారీలో వాడుతున్న నిషేధించబడిన రంగులు, గడువుముగిసిన ఉత్పత్తులను పారవేశారు. ఇదే విధంగా కొనసాగితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆహార వ్యాపారస్తులు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. లేకపోతే భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని తెలిపారు.

చీకోటిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మాచారెడ్డి, జూలై 25 : చీకోటి ప్రవీణ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బహుజన సేన ప్రతినిధులు డిమాండ్ చేశారు. హైకోర్టు అడ్వకేట్ బహుజన సేన వ్యవస్థాపకుడు కదిరెకృష్ణ సంస్కృతంలో పీహెచ్‌డీ పొందిన వ్యక్తి సంస్కృతంలో ఉన్న సుప్రభాతంను తెలుగులో ఉన్నది ఉన్నట్లుగా వివరించారని తెలిపారు. ఆ వివరణను ఎడిట్ చేసి వివాదాస్పదం చేయాలని దురుద్దేశంతో బీజేపీ నాయకుడినని చెప్పుకునే చీకోటిప్రవీణ్ పోలీసుస్టేషన్‌లలో ఫిర్యాదు చేసి హిందూ ధర్మ పరిరక్షకులమని తన అనుచరులతో కృష్ణను బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని మాచారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలి'



బీర్కూర్‌లో జీపీ కార్యదర్శులతో మాట్లాడుతున్న తహసీల్దార్ లత

బీర్కూర్, జూలై 25 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పురాతన ఇళ్ళు శిథిలావస్థలో ఉన్న గృహాలు కూలే ప్రమాదం ఉందని తహసీల్దార్ లత అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆమె జీపీ కార్యదర్శులకు ఆదేశించారు. పునరావాస కేంద్రానికి తరలించిన వెంటనే బాధితులకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే తమకు అందించాలన్నారు.

విద్యుత్ శాఖ డీఈపై విజిలెన్స్ అధికారుల విచారణ

బాన్సువాడ టౌన్, జూలై 25 : బాన్సువాడ విద్యుత్ శాఖలో విజిలెన్స్ అధికారుల విచారణ కలకలం రేపింది. విద్యుత్‌శాఖలో జరిగే పనులకు కాంట్రాక్టర్లపై పక్షపాత ధోరణి వహిస్తున్నారనే ఫిర్యాదు రావడంతో బాన్సువాడ డివిజినల్ అధికారి కామేశ్వరరావుపై గురువారం విచారణ చేపట్టామని విజిలెన్స్ ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపారు. ఈ విచారణ మూడురోజుల పాటు కొనసాగునుందని, పూర్తివివరాలు తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు,

'అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

పిట్లం, జూలై 25 : వర్షాకాలంలో మండలంలో ఎలాంటి అంటువ్యాధుల పట్ల మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, కార్యదర్శులతో తహసీల్దార్ సమావేశం నిర్వ హించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ గారి ఆదేశాల మేరకు వర్షాకాలంలో అంటువ్యాధులు, చెరువులు, కుంటలు, పురాతన ఇండ్లు, ఆయా అంశాలపై అధికారులకు సలు సూచనల, సలహాలు. తీసు కోవాల్సిన జాగ్రతలపై సమావేశం నిర్వహించారు. వర్షాకాలం రావడంతో మండలంలో అయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- ఓసీ
దర్శన్	- డార్లింగ్
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	- రాయన్
వెంకటేశ్వర	- పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

